# అంతరాత్మ కుదుపు



ఇల్లిందల సరస్వతీ దేవి

నాగమణి తలెత్తిచూసింది. గడియారం పదకొండు గంటలు కొట్టబోతున్నది. ఇంకా అరగంటసేపు ఎదురుచూడాలి. సరిగ్గా పదకొండున్నరకు కాకీ డ్రెస్సులో వస్తాడు పోస్టుమన్.

అతడు తీసువచ్చే ఉత్తరాలే తన ఊపిరి. ఒక్కొక్కరోజు అతడా దారిన పోతూ కనబడతాడు. అతడు వెళ్లగా చూసి లోపలికి వస్తుంది నాగమణి. ఆనాడంతా నిరాశా నిస్పృహలు ఆమెను ఆవరించుకుని ఉంటాయి. మనసెక్కడో విహరిస్తుండగా యాంత్రికంగా దిన చర్యను సాగిస్తుంది.

ఆశ్లేషను మనసులో తిట్టుకుంటుంది. "ఎంతపని ఉన్నా పదినిమిషాలు కూర్చుని ఉత్తరమ్ముక్క రాయకూడదూ? తన చేతి ఉత్తరంకోసం అలమటించే దీనురాలు నాగమణి ఇండియాలో ఉందని జ్ఞాపకం ఉంచుకోకూడదూ? తనకంటె అక్కడ కావలసినన్ని కాలక్షేపాలు. నాకు ఇక్కడేమున్నాయి?" తనకు ఆశ్లేషమీద ఉన్న అధికారమేమిటో అప్పుడు స్ఫురించదు నాగమణికి.

నర్సరీక్లాసునుంచి బి. ఏ. ప్యాసయే వరకూ ఇద్దరూ ఒక స్కూల్లో చదివారు. ఒక కాలేజీలోనే మళ్లీ చేరి పట్టభద్రులయ్యారు. తల్లి పసితనంలోనే పోయింది. తండ్రి తనకు పదిహేను సంవత్సరాలు వచ్చేవరకూ ఉన్నాడు. అతడు చనిపోయేటప్పుడు నాగమణిని మిత్రుడైన సుందరరామయ్య చేతిలో పెట్టాడు. ఇంపీరియల్ బ్యాంకునుంచి వచ్చే వడ్డీతో సుందరరామయ్య ఇంట్లో ఉండి చదువుతుంది. ఆమె మేజరవగానే సుందర్రామయ్య డాక్టర్ రమణమూర్తికిచ్చి పెళ్లిచేశాడు.

నాగమణికి పెళ్లయినా ఆశ్లేషతో స్నేహబంధం సడలలేదు. కాగా ఇంకా బిగుసుకుంది.

ఆశ్లేషకూ పెళ్లయింది. ఒక బిడ్డ కూడా పుట్టింది. ఆమె పెనిమిటి ఒక మైక్రోబయాలజిస్టు. ఇప్పుడు ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటున్నారు.

అయినా గంటలకొద్దీ ఆలోచిస్తూ కూర్చుంటుంది నాగమణి— "ఇప్పుడు

ఆశ్లేష ఏంచేస్తూ ఉంటుంది?" అనుకుంటూ.

ఇవాళ రాసిన ఉత్తరం రేపు చేరుతుంది. కాకపోతే ఎల్లుండి. అంతగా అయితే మరోరోజు. కాని అమెరికా నుంచి ఉత్తరం రావటానికి వారంపైన పడుతుందన్న సంగతి నాగమణికీ తెలుసు. కాని ఆ సంగతి అన్నివేళలా మనసులో ఉండదు.

మరునాడు ఆశ్లేషకుగాని పోస్టుమన్‌కుగాని తిట్లు తగలలేదు. నాగమణికి ఉత్తరం వచ్చింది. వరండాలో కుర్చీలో కూర్చుని చదవటం మొదలుపెట్టింది.

"ఇక్కడి విశేషాలు రాయమని వేధిస్తున్నావు. ఇక్కడ ప్రముఖంగా నన్నాకర్షించిన విషయమేమిటంటే– ఇక్కడి వాళ్లు నూటికి ఎనభైశాతం ఎప్పుడూ సైకియాట్రిస్టును సంప్రతిస్తూ ఉంటారు."

ఉత్తరం పట్టుకున్న చేతిమీద తల వాల్చుకుని ఆలోచనలో పడ్డది.

"అమ్మగారూ! భోజనంవేళయిందని పెద్దమ్మగారు చెప్పమన్నారు."

"ఆఁ వచ్చేస్తున్నా" మళ్లీ ఉత్తరం తెరిచి చూసింది. సైకియాట్రిస్టు!

సైకియాట్రిస్టంటే మతిభ్రమించిన వాళ్లకు వైద్యంచేసే ఆయనకాదూ?

"పెద్దమ్మగారు పిలుస్తున్నారు".

చేతిగడియారం చూసుకుంది. పది నిమిషాలు తక్కువగా ఒంటిగంట. "పాపం. పెద్దది" అనుకుంటూ లేచింది.

భోజనంచేస్తూ అడిగింది అత్తగారిని– "మన దేశంలో మతిభ్రమిస్తే ఏం చేస్తారు?" అంటూ

"ఆఁ– ఏంచేస్తారు? దయ్యం పట్టిందని వేపమండలతో కొడతారు. తల వెంట్రుకలు తీసి నిమ్మరసంతో తల రుద్దుతారు. మరీ ఎక్కువయితే పిచ్చాసుపత్రిలో చేర్పిస్తారు. ఎందుకొచ్చిందీ ప్రశ్న? ఎవరికయినా అవసరం వచ్చిందా?"

"ఎవరికీ రాలేదండి. ఊరికే అడిగా."

కాని– నాగమణి దాన్నిగురించి ఆలోచిస్తూనే ఉంది. అక్కడందరూ అటువంటివాళ్లేనా?

రమణమూర్తి వచ్చిన తరువాత ఈ ప్రశంస రెండుసార్లు ఎత్తింది. అతడు డబ్బుకు ప్రథమస్థానం ఇస్తాడు. రెండవ స్థానం తన రోగులకు ఇస్తాడు. అతడు ఫిథాలజిస్టు

"దాన్ని గురించి ఆలోచించకు. తోచకపోతే క్లబ్బుకు వెళ్లు. పేపర్లు తెప్పించుకుని చదువుకో."

అతడు ఎక్కువగా మాట్లాడడు. హాస్పిటల్లో పగలు పన్నెండు గంటల వరకూ పనిచేస్తాడు. సాయంత్రం నాలుగు గంటలనుంచీ తన ప్రయివేటు క్లినిక్‌లో రాత్రి ఎనిమిదిగంటల వరకు పనిచేస్తాడు. క్లినిక్‌నుంచి వస్తూ డబ్బులు వేసిన డబ్బా తెచ్చి అల్మరాలో భద్రపరుస్తాడు.

టైపుచేసిన రిపోర్టుల మీద సంతకాలు చేస్తూ తలఎత్తిన రమణమూర్తికి ఒక రంగుచీరె గదిలోకి వచ్చి కుర్చీ మీద కూర్చుంటున్నట్టు కనబడ్డది. ఆ రోజు ఆదివారం. హాస్పిటల్‌కు వెళ్ల లేదు.

"ఏం కావాలండీ" అడిగాడు తల ఎత్తకుండానే.

సమాధానంగా గలగల నవ్వింది నాగమణి.

"పనిలేని భార్యలు ఉంటే భర్తలు ఉద్యోగం చేస్తారు?" రిపోర్టులన్నీ కవర్లలో పెట్టేసి లేచాడు.

"మీ డబ్బా?" అంటూ జ్ఞాపకం చేసింది.

"డబ్బా అంటే నీకు హేళనగాని– డబ్బులేకపోతే రోజెట్లా గడుస్తుంది? మనిషికి మనుగడే డబ్బుతో ఉంది. ఈ క్లినిక్– ఈ ఇల్లు– నీవు– నేను అంతా డబ్బుతోనే. ఈ లోకాన్ని నడిపించేది డబ్బు. అది లేకపోతే అంతా శూన్యం" రమణమూర్తి లేచాడు.

"నిజమే డబ్బులేనిది ఏ పనీ కాదు. కాని– ఒక్క డబ్బుతోనే లోకం లేదు." ఆమెకూడా లేచింది.

పెళ్లి అయిన ఐదుసంవత్సరాలలో నాగమణికి రెండుసార్లు గర్భస్రావమయింది. అయిన స్రుడల్లా కోలుకోవటానికి కనీసం రెండు నెలలు పడుతున్నది. చేతికి అరపపు తలకట్టు నాగమణిది. సగానికి పైగా ఊడిపోయింది. మిసమిసలాడుతూ నిండుగా ఉండేమనిషి చిక్కి సగమయింది. రెండు కళ్లతో కోడలిని చూసుకుని మురిసిపోయే పద్మావతమ్మ కళ్లపక్కకు తిప్పుకుంటోంది. ఎప్పుడూ ఇరుగుపొరుగుల పిల్లలను గురించి మాట్లాడుతోంది.

ఆ ముగ్గురూ కలుసుకునేది భోజనాల సమయంలో. మాట్లాడుకునేది ఇతర విషయాలను గురించి.

రమణమూర్తి ఇంటికి చనువుగా వస్తూ ఉంటుంది డాక్టరు లావణ్య. కబుర్లు– పరిహాసాలూ, నవ్వులూ ఆమె వచ్చినప్పుడు వినబడుతూ ఉంటాయి. నాగమణీ పద్మావతమ్మలను కూడా గలగల నవ్విస్తుంది డాక్టరు లావణ్య.

"ఏమిటి ఇంకా ఇలా ఉన్నారు?" లావణ్య చిలిపినవ్వొకటి విసిరింది.

"ఎలా ఉన్నాను?" నిర్లిప్తంగా జవాబిచ్చింది నాగమణి.

"మళ్లీ ఈపాటికి ఇంతలావుగా కనబడదూ?"

తల అడ్డంగా తిప్పింది నాగమణి. కాని ఆమెకిప్పుడు నాలుగు నెలలు వెళ్లాయి. పద్మావతమ్మ మళ్లీ కలలు కనటం మొదలుపెట్టింది.

"మీరు మా హాస్పిటల్‌కు వస్తూ ఉండండి. నేను చూస్తూ ఉంటాను. మా స్నేహితురాలు మాల నర్సింగ్‌హోమ్

పక్క వీధిలో ఉంది. మీ రక్కడికి వస్తే నేనే వచ్చి చూస్తాను."

తలాడించింది నాగమణి.

మళ్లీ ఒక ఉత్తరం వచ్చింది అశ్లేష దగ్గర్నుంచి. ఈసారి పదిహేను రోజులకు వచ్చింది.

"ఇక్కడ జీవితం చాలా యాంత్రికంగా ఉంటుంది. ఇంట్లో ఒకరితో ఒకరికి సంబంధం లేకుండానే రోజు గడిచిపోతుంది. ఒకరి ప్రోగ్రాములు ఒకరికి తెలియను గూడా తెలియవు. ఎవరి కాలక్షేపాలను వాళ్లు వెతుక్కుంటారు. కొందరు గృహిణులు ఇంట్లో ఆత్మీయంగా మాట్లాడేవాళ్లు – చేసే పనిలేక – పిచ్చెత్తినట్లుంటారు. ఇంట్లో ఉన్న – ఆ ఒకరో ఇద్దరో పిల్లలు దూర దూరంగా ఉంటారు. భర్త పార్టీలలో మునిగి ఉంటాడు. వాళ్లనుచూస్తే జాలేస్తుంది."

ఆ ఉత్తరం మడిచి ఓ పుస్తకంలో పెట్టింది. నాగమణి. ఆమె ఈ మధ్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మూల నర్సింగ్‌హోమ్‌కు వెళ్లి డాక్టరు లావణ్యను పిలిపించుకున్నది రెండుసార్లు.

"ఇప్పుడు ఏడువరకూ వచ్చారుకదా? నేను చెప్పిన జాగ్రత్తలు తీసుకోండి. పదిహేను రోజుల కొకసారి నన్ను పిలవాలి" లావణ్య నొక్కిచెప్పింది

నాగమణి చాలావరకూ పడుకుని కాలం గడుపుతోంది. తనను గురించి గంటలకొద్దీ కూర్చుని అశ్లేషకు ఉత్తరాలు రాస్తోంది. వాటి నిండా తమ ఇద్దరి బాల్యస్నేహం, ఆటలూ పాటలూ, కబుర్లూ కాలేజి, జీవితం–అవే రాస్తుంది. రాసింది రాయకుండా జాగ్రత్తపడుతుంది.

"ఏమిటే మణీ? నీవు ఎప్పుడూ మన చిన్నప్పటి విషయాలను గురించే రాస్తావు? తరువాత జీవితంలో రాయతగినదేమీలేదా?"

అశ్లేష నాగమణికి తెలిసినట్టు మరెవరికీ తెలియదు! ఆమె చిన్నప్పుడు

ఏదీ పట్టించుకోనివాడు హాయిగా జీవిస్తాడు. (జర్మన్ సామెత.)




నౌకర్ల దగ్గర పెరిగింది. కొంచెం బుద్ధి తెలిసిన తరువాత తండ్రి స్నేహితుడి యింట్లో పేయింగ్‌గెస్టుగా పెరిగింది. ఎవరి దగ్గరా చనువుగా మాట్లాడలేదు. బెరుకు బెరుకుగా ఉంటుంది. ఆమె ఎవరితోనయినా నాలుగు మాటలు మాట్లాడిందంటే – నవ్వుతూ పలకరించిందంటే అది అశ్లేష ప్రభావమనే చెప్పాలి. ఆమె ముణగదీసుకున్న నాగమణిని తన మాటలతో సాగదీసేది. సంకోచాలను పొగొట్టేది. మూతి ముడుచుకుంటే గలగల నవ్వించేది. ఎద కవాటాలను తెరిపించేది. మళ్లీ మూసుకుపోకుండా చూసుకోమని మందలించేది.

నాగమణి నోటితో ఆర్భాటంగా పైకి అనకపోయినా అశ్లేషకోసం అలమటించిపోయేది. ఆమె సమక్షంలో ఉల్లాసంగా ఉన్నట్టు కనబడేది. ఆమె దూరమయిన తరువాత ఆమె ఉత్తరాలు నాగమణికి ఊరట కలిగిస్తున్నాయి కొంతసేపు.

డాక్టరు లావణ్య చెప్పినట్టు నాగమణి నర్సింగ్‌హోమ్‌కు వెళ్లి టెలిఫోను చేసింది. డాక్టరు వచ్చి అన్ని పరీక్షలు చేసి ఫరవాలేదంది. చిరునవ్వుతో నాగమణిని సాగనంపింది.

పది రోజులు గడిచాయో లేదో నాగమణిని నర్సింగ్‌హోములో చేర్పించి డాక్టరు లావణ్యకు ఫోనుచేశాడు రమణమూర్తి.

మరునాటి మధ్యాహ్నానికల్లా అందరి ముఖాల్లోనూ జీవకళ లేకుండాపోయింది. పద్మావతమ్మ నొసలు కొట్టుకుంది. రమణమూర్తికి చాలా ఆశాభంగమయింది.

పదవరోజున ఇంటికి వచ్చి స్నానం చేసి మంచంమీద పడుకున్న నాగమణి భోజనానికి కూడా ఆ గదిలో నుంచి కదలలేకపోయింది. మంచం దగ్గరే నాలుగు మెతుకులు కొరకటం– గోడవైపుకు తిరిగిపడుకోవటం– పలకరించినా మాట్లాడకపోవటం – ఆ యింట్లో రోజులు బరువుగా గడుస్తున్నాయి.

ఒక రోజు నాగమణి ఓపికచేసుకుని అశ్లేషకు పెద్ద ఉత్తరం వ్రాసింది. ఆ మరునాడు అశ్లేష దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. నాగమణి రాసిన ఉత్తరం అటుపోయింది. అశ్లేషది ఇటువచ్చింది.

"ఇక్కడ చాలామంది ఆడవాళ్లు సైకియాట్రిస్టును సంప్రదించటానికి వెళ్లుతూ ఉంటారు. వెళ్లేటప్పుడు ఏడుపు ముఖాలతో వెళ్లినవాళ్లు వచ్చేటప్పుడు ప్రశాంతమయిన మనసులతో నవ్వు

ముఖాలతో వస్తారు. సైకియాట్రిస్టు ఎంత ఓపికతో ఆత్మీయంగా మాట్లాడతా రనుకున్నావు? ఆ ఆప్యాయమైన పలకరింపుకే సగంరోగం పోతుంది. "మనకూ ఒక ఆప్తుడున్నాడు. మనం చెప్పినదంతా ఓపికతో వింటాడు. మనకు సానుభూతి దొరికేది ఇక్కడే" ననుకుని తమ బాధలన్నీ వెళ్ళగక్కుతారు. పిల్లలకూ పెద్దలకూ వాళ్ళకు జీవితంలో లభించని ప్రేమ అక్కడ దొరుకుతుంది. అందుకని భర్తలు నిర్లక్ష్యం చేసిన భార్యలు, తల్లిదండ్రులు ఉపేక్షించిన పిల్లలూ సైకియాట్రిస్టుల దగ్గర కనబడతారు.

మణీ, ఎలా ఉన్నావు? ముడుచుకుని కూర్చోవటం మానేశావా? మానిఉండవు. నా బాధ్యత మీ ఆయన వహిస్తాడనుకున్నాను. వహిస్తున్నట్టులేదు. అన్ని సంగతులూ వివరంగా రాయి.

సైకియాట్రిస్టంటే ఎవరో తెలిసింది కదూ?"

ఈ ఉత్తరం నాలుగు పేజీలది. మళ్ళీ మళ్ళీ చదువుకుని దిండుకింద పెట్టుకుంది నాగమణి.

క్లినిక్‌నుంచి ఇంట్లోకొస్తూ 'మణీ మణీ' అంటూ పిలిచాడు రమణమూర్తి.

పడుకున్న నాగమణి లేచి కూర్చోనయినా కూర్చోలేదు. కళ్ళుతెరిచి చూసింది.

"ఈయనెవరో తెలుసా నీకు మణీ!" రమణమూర్తి మంచందగ్గిరిగా కుర్చీవేసి ఆయనను కూర్చోబెడుతూ అడిగాడు.

రెప్పవాల్చకుండా చూస్తోంది నాగమణి ఆ వచ్చిన ఆయనను.

"నేను జ్ఞాపకం ఉన్నానా మణీ?"

ఆయన రూపురేఖలు అప్పటికీ ఇప్పటికీ మారిపోయాయి. కాని- కంఠధ్వని మారలేదు. ఆ పలకరించేతీరు మారలేదు. ఆ నవ్వులోని తరంగాలు చేసే శబ్దం మారలేదు.

"అఁ.... బాబాయి! ఎక్కణ్ణించి వచ్చావు? ఎప్పుడు వచ్చావు?"

"మన వాసుకి ఈ ఊరు ట్రాన్సఫరు అయిందమ్మా. నేను రాత్రేవచ్చాను. నీవు ఏమిటే ఇలా ఉన్నావు? ఈ పడక ఏమిటి?"

నాగమణి ఆయన కూర్చున్న కుర్చీని దగ్గరగా లాక్కోమని చేతిసైగచేసింది.

"మాట్లాడుతూ ఉండండి" రమణమూర్తి వెళ్ళిపోయాడు.

ఐదునిమిషాలు ఎదురుచూసి "అంతా రమణమూర్తి చెప్పాడు. ఎనిమిదవ నెలలో వచ్చిన పురుడు- పిల్ల పుట్టి పోవటం- అంతా చెప్పాడు. చెడు జరిగిందనుకో. అంతమాత్రంచేత నీవిలా అయిపోవటం ఏంబాగాలేదు."

మరి కొంతసేపయిన తరువాత పద్మావతమ్మ ఇచ్చిన గ్లాసెడుకాఫీతాగి "మణీ. నిన్ను చూసి ఎన్నేళ్ళయిందంటావు? నీ పెళ్ళికి రాలేకపోయాను" అన్నాడు.

"అవును. నాన్న పోయినప్పుడు చూసినట్టు జ్ఞాపకం."

"ఏమిటో. మీ నాన్న బంధువులను నమ్మకుండా స్నేహితుడిని నమ్మి ఆయన దగ్గర ఉంచాడు. నీ చిన్నప్పుడు నేను చెప్పిన కథలూ కబుర్లూ జ్ఞాపకం ఉన్నాయా?"

జ్ఞాపకం ఉన్నట్టుగా తల తిప్పింది మణి.

ఒక గంటసేపు అలా కబుర్లు చెప్పి ఆమెను నవ్వించాలని ప్రయత్నించాడు.

"అమ్మా నేను వెళ్తాను. పొద్దు పోయింది. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో."

ఆయన వెళ్ళేటప్పుడు "రేపుకూడా రా బాబాయ్"అని అందామనుకుంది మణి. కాని సమయానికి ఆ మాట అనలేక పోయింది.

మణి ఒక గంటసేపయినా కళ్ళుతెరిచి చూసిందని పద్మావతమ్మ సంతోషించింది.

మణికి ఎనిమిదవనెల పురుడొచ్చి నష్టపోయిందని తెలిసి అశ్లేషకు చాలా విచారం కలిగింది. మణి స్వభావం మొదటినుంచీ ఎరిగిఉన్నది కనుక ఆమె పరిస్థితిని ఊహించుకున్నది. తను వెళ్ళి స్వయంగా ఊరడించటం సాధ్యంకాదు. కనుక రోజుకొక ఉత్తరం రాయటం మొదలుపెట్టింది.

"నీకు లౌకికజ్ఞానం తక్కువ మొదటినుంచీ, చదువుకునే రోజుల్లో కూడా ఎవరితోనూ కలియకుండా అలా దూరంగా కూర్చునేదానవు. ఎప్పుడూ నీ వెనకాల ఎవరుంటారు- నీ మనసు నొచ్చుకోకుండా వాతావరణాన్ని మార్చటానికి? అందరూ నీతో ఎట్లా ఉన్నా- నీవు అందరితో స్నేహంగా మాట్లాడలేవా? వాతావరణాన్ని నీ కనుకూలంగా మార్చుకోవటం చేతకాదూ? బతకటం చేతకానిదానవు.

అన్నట్టు మనసు దెబ్బతిన్నట్టుంది ఈమధ్య. నిగ్రహాన్ని అలవరచుకో....

నేను సైకియాట్రిస్టును గురించి ఈ మధ్య ఉత్తరాలలో ఎక్కువగా రాస్తున్నాను. దాన్ని సరిగ్గా నీవు అర్థం చేసుకుంటావో లేదో? ఇక ఆ సంగతి వదిలెయ్. ఈ దేశంలో మనసులకూ ఆలోచనలకూ లోతులేదు. అంతా పైపై మెరుపు- లోపల శూన్యము. నీ కిది దగ్గరుండి బోధించాల్సిన విషయం.

మరొక్కమాట!- జరిగిన నష్టాన్ని గురించి ఆలోచిస్తూ ఆరోగ్యాన్ని పాడుచేసుకోకు. త్వరలో కోలుకోవటానికి ప్రయత్నించు. మళ్ళీ రాస్తాను."

ఈ ఉత్తరాన్ని నాలుగయిదుసార్లు చదువుకుని దిండుకింద పెట్టుకుంది.

ప్రతిరోజూ ఆ వేళకు గోడకు తిరిగి పడుకునేది. ఆ క్రిందటిరోజు రాత్రి ఎనిమిదిగంటలకు రమణమూర్తి బాబాయిని తీసుకువచ్చాడు. ఆయన ఇవాళకూడా వస్తే బాగుండుననిపిస్తోంది ఆమె మన

సునకు. కళ్లుతెరిచి ద్వారం వైపుకు దృష్టినిపోనిచ్చి ఎదురుచూస్తోంది.

ఎనిమిదిగంటల తరువాత రమణ మూర్తి వచ్చాడు.

"భోజనం చేద్దామా ?"

"నాకు ఆకలిలేదు. తినలేను."

అంతలో పద్మావతమ్మ వచ్చింది. ఆమె అన్నం కలుపుకుని తీసుకువచ్చింది. బలవంతంచేసి నాలుగు ముద్దలు తిని పించింది.

"మణీ. నిండా పాతికేళ్లులేవు. అప్పుడే జీవితమంతా అయిపోయినట్టు కుంగి పోతున్నావు. ఆరోగ్యంగా ఉన్నవాళ్లు మంచాన్ని అంటిపెట్టుకుని పడుకుంటే లేనిజబ్బులు కూడా వస్తాయి. నీవు పని చేయక్కర్లేదు. కాని- లేచి తిరుగు." మందలించింది పద్మావతమ్మ.

కళ్లనిండా నీళ్లు- పక్కకు తిరిగి పడుకుంది మణి.

ఆ మరునాడు ఉదయం పదిగంటలకే గదిలో అడుగుపెట్టిన బాబాయిని చూసి ప్రాణం లేచివచ్చినట్టయి ముఖం విక సించింది మణికి. కూర్చోమని దగ్గరగా ఉన్న కుర్చీ చూపించింది.

"రాత్రి వస్తావనుకున్నాను" అన్నది.

"దృష్టి మందగించింది. అందులో మబ్బేసింది రాత్రి. వర్షం వస్తుందని భయపడ్డాను." సర్దుకుని కూర్చున్నాడు.

"పిన్నికూడా వచ్చిందా? వాసుకు పెళ్లయిందా?" మెల్లగా ప్రశ్నలు వేసింది.

"ఒక్కసారి రెండు ప్రశ్నలు వేశావు. వాసు నాలుగేళ్లనుంచీ ఉద్యోగంలో ఉన్నాడు. మీ పిన్ని పెళ్లిచెయ్యకుండా ఉంటుందా? పిన్నికూడా వచ్చిందా అని అడిగావు మొదట. తిండివేళ- నిద్ర వేళలు ఎరుగని నన్ను కనిపెట్టి చూడొద్దూ? నా వెంటనే వచ్చింది."

"మరి తీసుకురాలేదేం?"

"కాసేపయినా ఫ్రీగా ఉండాలనిపించదూ నాకు ?"

ఓపికలేని నవ్వొకటి ఆమె పెదవుల మీద నాట్యంచేసింది ఆ మాటకు.

ఆయన తన భార్యను గురించి చాలా సేపు వినోదంగా మాట్లాడాడు.

"బాబాయి! సైకియాట్రిస్టంటే ఏమిటి? నీ వెప్పుడయినా విన్నావా ఈ మాట?" అరచేతిమీద తలమోపి అడిగింది మణి.

"నాకు బాగా తెలియదు గాని అమ్మాయి - కొంతవరకూ చెప్పగలను. మానసిక వ్యాధులు ఏ కారణంచేత వస్తాయో తెలుసుకుని తగిన చికిత్స చేసే వాడు అని వైద్యుడన్నమాట."

"ఎలా తెలుసుకుంటాడు ?"

"ఎట్లా ఏముంది ? రోగిదునెరుగా కూర్చుని ఊరికే మాట్లాడిస్తూ ఉండాలి. మాట్లాడగా మాట్లాడగా ఎక్కడో పట్టు బడుతుంది. దాన్ని మళ్లీ మళ్లీ చెప్పించ గలగాలి. ఆ భావం వ్యక్తంచేసేటప్పుడు రోగి ముఖం చూడాలి. ఉద్రేకంయొక్క స్థాయిని గుర్తించాలి."


"అంత తెలివితక్కువగా పైకి చెప్పేస్తారా ఎవరయినా ?"

"ఎందుకు చెప్పరు ? బాధ కొద్దీ చెప్పేస్తారు."

"తెలివితక్కువతనం."

అంతలో మాట మార్చేశాడు బాబాయి. "అమ్మాయీ! నీకు జ్ఞాపకం ఉందా? నీ చిన్నప్పుడు నిన్ను ఒకసారి మంగళగిరి తీసుకువెళ్లాను. నరసింహస్వామికి పానకం పోయించాము- గుర్తుకు వచ్చిందా ?"

"ఆఁ.... ఆఁ. అక్కడ పానకంతో గుళ్లో నేలంతా తడితడిగా ఉంటుంది- గాని బెల్లానికి ఒక్క చీమయినా రాదు.



ఒక్కోసారి ధైర్యం అంటే చావటానికి కూడా సిద్దపడటం కాదు బ్రతికి ఉండటము. (అల్ఫియరీ)




నేనడిగాను కూడా చీమలెందుకు లేవని."

"అదికాక _ మరో విశేషం. ఎంత పానకం పొయ్యదలచుకుంటావో_అంటే ఒక బిందెడు పొయ్యాలనుకుంటావనుకో సగం పోసేవరకే బళక్కు_మన్నట్టు శబ్దం వినబడుతుంది. స్వామికి పోసిన పానకం మన కాళ్ల కిందకే వస్తుంది. స్వామికి పానకం చాలని అర్చకులు అంటారు. ఆ మిగతా పానకం అందరికీ గ్లాసులో పోసి ఇస్తారు."

"అది నిజంగా జరుగుతుందా ?"

"జరగనట్టనిపిస్తుంది. భక్తులు కదమ్మా ? స్వామి వారిని గురించి ఏం చెప్పినా భక్తిభావంతో నమ్మేస్తారు. స్వామికి దంతధావనం - స్వామికి పవళింపు సేవ_ఇవన్నీ ఏమిటి ? భక్తులు నమ్ముతారు. ఆ స్వామి తమ కష్టాలు తీరుస్తాడని విశ్వసిస్తారు. స్వామిని పూర్తిగా నమ్ముతారు."

"నిజమా ?"

"అదే కాదు. అలా పూర్తిగా నమ్మి తమ మనోవ్యాధులు మర్చిపోతారు. భారమంతా స్వామిపైన ఉంచుతారు."

మణి ఆలోచనలో పడ్డది.

"చూడమ్మా స్వామిని మనసారా నమ్మితే ఆయనే ఒక సైకియాట్రిస్టు."

కళ్లు పెద్దవిచేసుకుని చూసిందిమణి.

అంతలో పద్మావతమ్మ అటుగా వచ్చి "భోజనాల వేళయింది" అంది. ఇవాళ "మా యింట్లో భోజనం చేద్దురు గాని."

"అమ్మా. నా భార్య ఉన్నది చూశారా ? భోజనం చేయ్యనిదే ఎక్కడికీ కదలనీయదు. నేను భోజనం చేశాను. మళ్లీ కాఫీవేళకు ఇంటికివెళ్లాలి".

"మంచి క్రమశిక్షణలో ఉంచారే మిమ్మల్ని ?" ఆమె నవ్వుతూ వెళ్లిపోయింది.

మరి కాసేపటికాయన వెళ్లిపోయాడు.

మణికి పురుడొచ్చి నెల రోజు లయింది. బాబాయి కబుర్లతో అశ్లేష ఉత్తరాలతో కాస్త హుషారు వచ్చినట్ల యింది. మంచమ్మీద లేచి కూర్చుంటోంది.

అనాడు బాబాయి రాలేదు. నాలుగు గంటల వేళ మాలా నర్సింగుహోముకు వెళ్లి డాక్టరు లావణ్యకు ఫోనుచేసి పిలి పించుకుంది.

డాక్టరు కనపడగానే ఆమె గుండెకు హత్తుకుపోయింది.

"ఏమిటి ? ఇంత భయపడతావేం ?" మణిని కూర్చోబెట్టి అనునయంగా అడి గింది డాక్టరు.

"నువ్వేం చెయ్యొద్దు. మామూలుగా ఉండు, అన్నిటికి నేనున్నానుగా !" ధైర్యంచెప్పి వీపుతట్టింది డాక్టరు.

"నేను ఇదంతా కడుపులో పెట్టుకుని భరించలేను. నాకు పిచ్చెక్కి_పోతున్నది." కళ్లు తుడుచుకున్నది.

"ఇంతవరకూ వచ్చిన తరువాత వెన కడుగు వేస్తే ఈ శ్రమంతా వృధా పోతుంది. నేను సహజంగా అంతా నడుపుకొస్తున్నాను కదా."

"నాకు ధైర్యం లేదు. నేను భరించ లేను" రెండు చేతులతో తల పట్టుకుంది మణి.

ఆరోజు బాబాయికోసం ఎదురు చూస్తుంటే అశ్లేష రాసినఉత్తరం చేతికి వచ్చింది.

ఆత్రంతో గబగబా చింపి చదవటం మొదలుపెట్టింది.

"మణీక్క. ఇతడిది అత్యంతాధునిక మైన సొసైటీ కదూ ? అందుకని భార్యా భర్తలు ఒకరికొకరు మోసం చేసు కుంటారు. అది బైటపడ్డనాడు డైవర్సు చేసుకుంటారు. దాంపత్య జీవితంలోను, పిల్లల విషయంలోను సాధారణంగా జరుగుతూనే ఉంటాయి ఈ మోసాలు. తరుచుగా జరుగుతాయి కనుక వాటికి అలవాటుపడ్డది సమాజం.

అన్నట్టు మరచాను రాయటం - నీ ఆరోగ్యం ఎలావుంది ? నీ మనసులో నుంచి సైకియాట్రిస్టును వెళ్లగొట్టావా లేదా ?

పద్మావతమ్మ అనాడు బాబాయిని భోజనానికి ఉంచేసింది. ఆయనకోసం కొత్తవంటకాలు చేసింది. మనసులో ఏమనుకుందో ఏమిటో, "అత్తయ్యా

బాబాయికి నేను వడ్డిస్తా" నంటూ గదిలో నుంచి మణి లేచివచ్చింది.

ఆయన వస్తున్నప్పటినుంచీ మణిలో క్రమంగా వస్తున్న మార్పుకు పద్మావతమ్మ సంతోషిస్తున్నది. ఏరోజుకారోజు "మళ్లీ వస్తూ ఉండండి" అంటోంది.

భోజనాలయిన తరువాత గదిలోకి వెళ్లి మళ్ళీ కబుర్లలోపడ్డారు. మణి మధ్య మధ్య ఏదో అసందర్భంగా మాట్లాడుతోంది. ఆమె మనసులో ఒకరిని మోసంచేశాననే విషయం సుళ్లుతిరుగుతోంది. ఆవేదన అవిర్లు తేలుతోంది. ఏమిటి దీని పర్యవసానం ? ఇదంతా దేనికి దారితీస్తుంది ? అశ్లేష రాసినట్టు దైవద్రోహకు దారితీస్తే ?

రెండు రోజుల తరువాత రమణమూర్తి ఇంటికివచ్చేసరికి మణి పడుకునే ఉంది. రోజూ గోడవైపు తిరిగి పడుకునేది కళ్లు తెరుచుకుని వెల్లకిలా కదలకుండా పడుకుందంటే ఏదో ఉంది మార్పు అనుకుని చెయ్యిపట్టుకున్నాడు.

ఒళ్లు కాలిపోతోంది.

అతడు డ్రెస్సు మార్చుకోకుండా అలాగే కుర్చీమీద కూర్చుని ఆమెచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అతడికి మొట్టమొదటిసారిగా ఆమెమీద జాలి ముంచుకువచ్చింది.

"అమాయకురాలు పాపం" అనుకున్నాడు. అతడి మనసులో ఏదో ముల్లులా గుచ్చుకుంటోంది. ఆవేదన పైకెగసి పడుతోంది. చేత్తో కణతలు రుద్దుకుంటున్నాడు.

"ఏమిట్రా అలా కూర్చున్నావు ?" పద్మావతమ్మ కేకపెట్టింది.

"మణికి జ్వరం వచ్చింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటోందనుకుంటే మళ్ళీ ఇదొకటి వచ్చిపడ్డది."

"అన్నిటికీ అధైర్యపడ్డం తగ్గించుకో. జ్వరంవస్తే తగ్గదా ఏమిటి ?" ఆమె మందలించింది.

మనకు సంభవించే రెండురకాల ఆపత్తులు, ఒకటి మనకు పట్టిన దురదృష్టం. రెండవది మరొకడికి పట్టిన అదృష్టం. (లాబ్రుయరీ)




రాత్రింబగళ్లు మణి మంచందగ్గరే కూర్చున్నాడు రమణమూర్తి. అలా వారం రోజులుకాసింది జ్వరం. డాక్టరు లావణ్య రెండు సార్లువచ్చి చూసింది.

అంతవరకూ బిగబట్టుకుని ఉన్న మణి బాబాయిని చూడగానే బావురుమని ఏడ్చేసింది.

"ఏమిటమ్మా ఈ కాస్త జ్వరానికేనా ఇంత ఏడుపు ?"

ఆమె మనసులో ఇంకేదో బాధ ఉందనుకున్నాడాయన ఆ ఏడుపు చూసి.

"మణీ ఈ జ్వరం తగ్గిపోయిన తరువాత విన్నెక్కడికయినా తీసుకువెళ్తాను వస్తావా ? పదిరోజులు అట్లా తిరిగివస్తే మనసుకు ఉల్లాసంగా ఉంటుంది. ఏమంటావు ?"

"నిజమే బాబాయి. నేను ఇల్లుకదిలి చాలా రోజులయింది. తీసుకెళ్లు. నన్ను నీ వెంట తీసుకెళ్లు !" అంది కాస్త ఉద్రేకంతో.

ప్రయాణంవల్ల మణి మనసులో కాస్త మార్పు కలుగుతుందని రమణమూర్తి కూడా ఆశించాడు. ఈ ప్రయాణ భారమంతా బాబాయి వహిస్తానన్నందుకు అతడికి చాలా సంతోషంగా ఉంది.

"మీకు తోచినచోటికి తీసుకువెళ్లండి. మణి మనసు ఉల్లాసంగా ఉండటమే నాకు కావలసింది" అన్నాడు.

మణి బాబాయితో వెళ్లి వాళ్లింట్లో రెండు రోజులుంది. ఆప్యాయతతోపెట్టిన పిన్నిచేతి భోజనం - ప్రేమతో బాబాయి చెప్పే కబుర్లు కొంత ఊరటకలిగించాయి. బాబాయి పిన్నీ ఇద్దరూ అటోకరూ ఇటోకరూ ఉండి ప్రయాణం సాగించారు.

"అమ్మా. మనం తిరుపతి వెళ్తున్నాం టాక్సీమీద కొండెక్కుదాము" అన్నాడు బాబాయి.

"తిరుపతా! ఎన్నాళ్లనుంచో చూడాలన్న ఆశ మీ బాబాయి, ఇప్పుడు నీవు వలింపచేస్తున్నావు" సంబరపడ్డది మణి చిన్నపిల్లలా.

టాక్సీలో ఒక్కొక్క కొండా దాటుతుంటే మణి మనసు గింగుర్లుతిరుగుతున్నట్లనిపిస్తోంది. అశ్లేష రాసిన ఉత్తరాలు జ్ఞాపకం వస్తున్నాయి. మనసులో ఉన్న బాధను ఎవరికయినా చెప్పుకోవాలి.

చెప్పుకోకపోవటం వల్లనే మానసికంగా కుంగిపోతోంది. ఎవరికో చెప్పుకోవాలి? అంతటి ఆప్తులెవరు? రమణమూర్తిని ఆప్తుడుగా చేసుకోలేకపోతోంది

కొండమీదికి వెళ్ళి సామాను కాటేజీలో పడేసి ధర్మదర్శనం క్యూలో నిలబడ్డారు. పిల్లలు-పెద్దలు-స్త్రీలు-పురుషులు-పండితులు పామరులు-రకరకాల మనుషులు క్యూలో ఉన్నారు. ఆ తోపులాటలో గర్భగుడిలోకి ఎప్పుడొచ్చారో ఆమెకు తెలియదు.

కళ్లెత్తి - వెడల్పుచేసుకుని నిలువెత్తు వెంకటేశ్వరస్వామిని చూసింది. తదేకంగా చూసిచూసి “స్వామీ సైకియాట్రిస్టంటే ఎవరో ననుకుంటున్నాను ఇంత కాలం! నీవే-నీవే సైకియాట్రిస్టంటే” అనుకుని మనసులో గొణుక్కుంది. రెండు చెంపలూ వాయించుకుంది.

తిరుగుప్రయాణంలో ఆమె మనసు ఎంత ఉల్లాసంగా ఉందో ఆమె అంచనా వెయ్యలేకపోయింది. మరో రెండుఊళ్లు తిరిగి, ఆహ్లాదమైన ప్రకృతి దృశ్యాలు చూసి అంచులు కనబడని సముద్రం-ఆకాశంతో చేతులు కలిపే సముద్రం చూసి - ఒడ్డున కాళ్లు మునిగేవరకూ తిరిగి-పదిహేను రోజులకు ఇంటికి తిరిగి వచ్చారు. పాపం ప్రక్షాళనమయినట్టుగా మనశ్శాంతి కలిగినట్టుగా ఉంది మణికి.

సంతోషమే సగంబలంగా తిరిగి తిరిగి వచ్చిన మణిలో నవచైతన్యం తొణికిసలాడుతున్నట్టు కనబడ్డది రమణమూర్తికి.

రమణమూర్తి మనసు కొండంత బరువు గుండెలమీదఉన్నట్టు భారమవటం మొదలుపెట్టింది.

అన్యాయం- అన్యాయం అంటూ మనసు గిలగిల కొట్టుకుంటోంది. అతడు తనపని తాను చేసుకోలేకపోతున్నాడు. తోటివాళ్ళతో సరిగా మాట్లాడలేకపోతున్నాడు. తల్లిదగ్గర సరిగా మసలుకోలేకపోతున్నాడు. మణిని చూడగానే జాలిపడే అతడి మనసు కుచించుకుపోవటం మొదలుపెట్టింది.

“అబ్బాయి! ఆరోగ్యం సరిగ్గా లేకపోతే సెలవుపెట్టు. హాస్పిటల్లో చేసిన కొద్దీ చాకిరి. ఇంట్లో ఉండు. నామాట విను” పోరాటం మొదలుపెట్టింది తల్లి.

“ఏమిటి? ఏమయింది? హాస్పిటల్‌కు రావటంలేదా? ఏదయినా సుస్తీనా?” నాలుగు రోజుల తరువాత ఇంటికి వచ్చి అడిగింది డాక్టరు లావణ్య.

బాగా పెరిగిన గడ్డంతో గదిలోనుంచి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు రమణమూర్తి.

“ఇదేమిటి ఇలా తయారయ్యారు? ముఖం బాగా పీక్కుపోయి నట్టయింది. ఆవిడేనయం-ఊరికెళ్లి వచ్చిన తరువాత మనిషి బాగుంది” అన్నది.

పెదవి విరిచాడు రమణమూర్తి.

అంతలో పద్మావతమ్మ వేడి వేడి టిఫిన్ తెచ్చిపెట్టింది.

“మిమ్మల్ని చూస్తే జాలేస్తున్నది నాకు” అన్నది డాక్టరు.

“నన్ను చూస్తే జాలికాదు కలగాల్సింది ఆగ్రహం కలగాలి” అన్నాడు తలవంచుకుని.

“చేతులారా చేసుకున్నదానికి సమర్థించుకున్నా కొంత నయం. ఇదేమిటి మీరు చేస్తున్నది? అప్పుడా ఎమర్జెన్సీలో ఎవరో లాక్కుపోయారని ఆ వాసెక్టమీ చేయించుకోవటమెందుకు? పిల్లలు పుడుతున్నట్టుగా నాచేత నాటకాలాడించి ఆమెను మోసగించటానికి ప్రయత్నాలు చేయటమెందుకు? వాసెక్టమీ తిప్పించుకోవచ్చుకదా?” మందలించింది డాక్టరు.

“ఆ ప్రయత్నమూచేశాను. అప్పుడు డాక్టరు తొందరపాటులో చేసిన ఆపరేషను కదా? డజన్లకు డజన్లు చేసిన ఆపరేషన్లు. పొరబాటున మళ్ళీ తిరుగులేకుండా చేశాడు. నా బాధ ఏమిటంటే పెళ్లికాకుండానే వాసెక్టమీ ఆపరేషను చేయించుకోవటమే కాకుండా ఇప్పుడు నెలలునిండా గర్భాన్ని మోయలేకపోతోందని నెపమంతా మణిమీద వెయ్యాలని మీచేత నాటక మాడిస్తున్నందుకు. ఇదంతా తెలుసుకోలేని అమాయకురాలినా నేను మోసంచేయటమన్నబాధ రంపపుకోతగాఉంది” తలవంచుకున్నాడు.

“రమణమూర్తి గారూ! ఆ మాటకొస్తే మీయిద్దర్నీ మోసంచేసింది నేను. ఒకరి సంగతి ఇంకొకరికి చెప్పకుండా మీ యిద్దర్నీ మోసం చేసింది నేను. నా ప్రయత్నము వల్ల ఆమె సంగతి మీతో చెప్పకుండాను, మీ సంగతి ఆమెతో చెప్పకుండాను వాగ్దానం చేసినట్టుగా నడుచుకుంటున్నా ననుకున్నాను గాని ఇద్దర్నీ మోసపోయేట్టు చేస్తున్నాననుకోలేదు.”

ఏమిటన్నట్టు కళ్ళతో ప్రశ్నించాడు రమణమూర్తి.

“మణిగారు చిన్నప్పుడు పడ్డ దెబ్బవల్ల ఆమె గర్భంధరించేశక్తిని కోల్పోయింది. తనను మీరు తిట్టి శపించకుండా నా శరణజొచ్చింది. అందువల్ల మీరు అడమన్న నాటకానికి వీలుదొరికింది. ఆమె సహకారం లేకపోతే ఈ నాటకం రక్తికట్టేది కాదు. ఇప్పుడు చెప్పండి-ఎవరికి ఎవరు మోసంచేశారో?”

పాలిపోయిన రమణమూర్తి ముఖం కిందికి వాలిపోయింది. “అయితే- నేను పడ్డంత బాధ మణికూడా పడ్డదన్నమాట!” గొంతులో మాట గొంతులోనే గుడగుడలాడింది.

ఎండలో వచ్చిన వానజల్లు వెండితీగెలు మెరిసినట్టు మెరిసింది. పిల్లలనాడుకోనిచ్చింది. పెద్దలను వీధిలో నడవనిచ్చింది. భూమిని కాస్త తడవనిచ్చింది. మణీ రమణమూర్తులకు జరిగినదాన్ని తేలికగా భావించేటట్టు చేసింది- పెద్ద సైకియాట్రిస్టులా!